పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

## 111. అల్ లహబ్ సూరా పరిచయం

మక్కాలో అవతరించింది. 5 ఆయత్‌లు, ఒక రుకూ ఉన్నాయి.

ఈ సూరాను సూరతుల్ మసద్ అని కూడా అంటారు. దైవప్రవక్త (స)కు తన బంధువులలో ధర్మప్రచారం చేయమని ఆదేశించబడినప్పుడు ఆయన (స) సఫా కొండపైకి ఎక్కి "యా సబాహా" అని నినదించారు. ఇలా నినాదం ఇవ్వడం ప్రమాద సూచికగా భావించబడేది. అందువల్ల ఆ పిలుపుకు అందరూ గుమికూడారు. ఆయన (స) అన్నారు, "చూడండి, ఈ కొండ వెనుక గుర్రాల సైన్యం మీపై దాడి చేయగోరుతుందని నేనంటే మీరు నమ్ముతారా?" వాళ్ళన్నారు, "ఎందుకు నమ్మం? మిమ్మల్ని మేమెప్పుడూ అబద్ధాల కోరుగా చూడలేదు." ఆయన (స) అన్నారు, "అయితే వినండి మిమ్మల్ని ఒక పెద్ద విపత్తు నుండి హెచ్చరించాలని వచ్చాను. (మీరు కుఫ్ర్, షిర్క్‌లలో చిక్కుకుని వుంటే)." ఇది విని అబూలహబ్ అన్నాడు, "నువ్వు నాశనం గాను, ఇందుకోసం మమ్మల్ని పిలిచావా?" అప్పుడు అల్లాహ్ ఈ సూరాను అవతరింపజేశాడు. (సహీహ్ బుఖారీ అత్ తఫ్సీర్ – సూరె లహబ్ – హ.నెం. 4397)

అబూలహబ్ అసలు పేరు అబ్దుల్ ఉజ్జా. తన అందచందాలు, ఎర్రని ముఖ వర్చస్సు కారణంగా అబూలహబ్ అని పిలువబడేవాడు. తన పర్యవసానం రీత్యా కూడా వాడు నరకాగ్నికి ఇంధనం కావలసిన వాడు. ఇతడు దైవప్రవక్త (స)కు స్వంత బాబాయి. కాని ఆయనకు బద్ధ శత్రువు. అతడి భార్య ఉమ్మె జమీల్ బిన్తె హరబ్ కూడ ప్రవక్త (స) పట్ల శత్రుత్వంలో తన భర్తకేమీ తీసిపోలేదు.

## 111. సూర అల్ లహబ్

**ఆయత్‌లు : 5** **అవతరణ : మక్కాలో**

పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

(1) అబూలహబ్ చేతులు విరిగిపోయాయి. వాడు నాశనం అవుగాక! (2) వాడి సొమ్ము వాడికి పనికి రాలేదు. వాడి సంపాదనా పనికి రాలేదు.

(3) వాడు అతి త్వరలో భగభగ మండే మంటలో వేయబడతాడు.

(4) వాడితోపాటు వాడి భార్య కూడ ఇంధనాన్ని నెత్తినపెట్టుకు తిరిగేది.

(5) ఆమె మెడలో పేనిన త్రాడు ఉంటుంది.

آیَاتُهَا 5 ﴿111﴾ سُورَةُ اللَّهَبِ مَكِّيَّةٌ رُكُوعُهَا 1

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

تَبَّتْ يَدَآ اَبِيْ لَهَبٍ وَّتَبَّ ﴿1﴾

مَآ اَغْنٰى عَنْهُ مَالُهٗ وَمَا كَسَبَ ﴿2﴾

سَيَصْلٰى نَارًا ذَاتَ لَهَبٍ ﴿3﴾

وَّامْرَاَتُهٗ ؕ حَمَّالَةَ الْحَطَبِ ﴿4﴾

فِيْ جِيْدِهَا حَبْلٌ مِّنْ مَّسَدٍ ﴿5﴾

ع 1 5 36

1 – 5 వాక్యాలు

అబూలహబ్ దైవప్రవక్త (స) పట్ల వ్యతిరేకతలో హద్దుమీరి పోయినపుడు ఇస్లాం ప్రచారంలో తీవ్ర అవరోధంగా తయారయ్యాడు. అల్లాహ్ ఖుర్ఆన్‌లో వాడ్ని అభిశంసిస్తూ ఒక సూరాను అవతరింపజేశాడు. దాని పేరు సూర లహబ్. అబూలహబ్ అగ్ని జ్వాలలా (ఎర్రగా) ఉండేవాడు. కాబట్టి అల్లాహ్ ఏ లక్ష్యంతో హజ్రత్ ముహమ్మద్ (స)ను ప్రవక్తగా చేసి పంపాడో ఆ లక్ష్యం పూర్తయిందని సూరయె నస్ర్‌లో చెప్పబడింది. అంటే తౌహీద్ ఎల్లెడలా వ్యాపించింది. షిర్క్ అంతం చేయబడింది. మక్కా జయించబడింది. విగ్రహాలన్నీ విరగగొట్టబడ్డాయి. అరబ్బులంతా ముస్లింలు అయ్యారు. ఇక సూరయె లహబ్‌లో అల్లాహ్ సెలవిస్తున్నాడు, అల్లాహ్ తన శత్రువులను అంటే అబూ లహబ్‌ను నాశనం చేశాడు. వాడి కుఫ్ర్‌ను తుడిచిపెట్టాడు. కనుక ధర్మం వచ్చేసింది, అధర్మం పరారయ్యింది.